ఓం శ్రీసాయిరాం

# భగవాన్ శ్రీసత్యసాయి సేవాసంస్థలు

## ప్రకాశం జిల్లా - ఆంధ్రప్రదేశ్



# సేవారాధన

(సంగీత నృత్య నాటకం)

రచన దర్శకత్వం

**M.S. ప్రకాశరావు**

గీతరచన

**M.S. ప్రకాశరావు**

**G.V. సుబ్రహ్మణ్యం**

పద్యరచన

**శాంతిశ్రీ**

ప్రదర్శకులు

**శ్రీ సత్యసాయి యువత, బాలవికాస్ బాలురు**

ఓం శ్రీసాయిరాం

# శ్రీ సత్యసాయి సేవాసంస్థలు

## ప్రకాశంజిల్లా - ఆంధ్రప్రదేశ్

# 'సేవారాధన'

(సంగీత నృత్య నాటకం)

రచన, దర్శకత్వం :

**యమ్. యస్. ప్రకాశరావు**

గీతరచన :

**యమ్. యస్. ప్రకాశరావు**

**జి.వి. సుబ్రహ్మణ్యం**

పద్యరచన :

**శాంతిశ్రీ**

ప్రదర్శకులు :

**శ్రీ సత్యసాయి యువత**

**శ్రీ సత్యసాయి బాలవికాస్ బాలురు**

# 'సేవారాధన'

## (సంగీత నృత్య నాటకం)

### :: పాత్రలు ::

| | | |
|---|---|---|
| రాజారాం | ... | ఉపాధ్యాయుడు |
| నాగయ్య<br>అవధాని<br>పైడిరాజు | ... | గ్రామ పెద్దలు |
| రామయ్య | ... | పాలేరు |
| శివయ్య | ... | పేదగ్రామస్తుడు |
| అనిరుధ్ | ... | సత్యసాయి సేవాదళ్ సభ్యుడు |
| విశ్వనాధం<br>రమేష్<br>రాజేష్ | ... | విద్యార్థులు |
| ధర్మారావు | ... | విద్యావంతుడైన గ్రామ యువకుడు |

**పాటలు, నృత్యాలు..**

1. నీ పాదములను నమ్మిన వాడను నీరజాక్ష బాబా
2. నా నోట శ్రీసాయినామమున్నది మదిలోన సాయిరామ మంత్ర మున్నదీ
3. పర్తిపురీశుని చూడరమ్మో పరమాత్ముడొచ్చాడు పాడరమ్మో

**పద్యాలు..**

1. కౌస్తుభ చక్ర సరోజ లాంఛిత మధుర సుందర గాత్ర మాధవుండు
2. చిన్నతనముననే చెలువార ఒక పంతులయ్యను కుర్చీకి అంటరేసె
3. పావనంబులు భక్తజీవనంబులు నీదు

# సేవారాధన

## (సంగీత నృత్య నాటకం)

(రాజారాం మేష్టారు, గ్రామపెద్దలూ ఉండగా పిల్లలు పాడుతూ నృత్యం చేస్తూ ప్రవేశిస్తారు)

పల్లవి. నీ పాదములను నమ్మినవాడను నీరజాక్షబాబా
సన్నిధి చేరితి శాంతి నొసంగుము సత్యసాయిబాబా
సత్యసాయిబాబా ॥ నీ పాదములను॥

చ-1. లెక్కకు మించిన పెక్కు గ్రంథములు పుక్కిటి బట్టితి బాబా
ఒక్కటైన పరమాత్మను పొందెడి దిక్కు చూపదు బాబా ॥ నీ పాదములను॥

చ-2. పదములు కావవి ముక్తి మందిరపు పసిడి తలపులు బాబా
భక్తిసూత్రమున నన్ను చేదుకుని భద్రత నొసగుము బాబా ॥ నీ పాదములను॥

చ-3. ధ్యానముద్రలో దర్శనమొసగుము దాసపోషక బాబా
నిత్యసత్యమగుజ్ఞానజ్యోతివై నిలువుమయ్యబాబా ॥ నీ పాదములను॥

రాజారాం : నమస్కారం నాగయ్యగారూ! ఊరి పెద్దలంతా స్కూలుకు విచ్చేశారు. ఏమిటి విశేషం?

నాగయ్య : విశేషమే! పాఠశాల సక్రమంగా నడుస్తున్నదో లేదో తెలుసుకోవడం మా బాధ్యత కదా! అందుచేత ఒకసారి చూసి వెళదామని వచ్చాం.

అవధాని : ఇంతకు ముందులా కాక స్కూలు ఏదో కాస్త భిన్నంగా నడుస్తున్నాదని విన్నాం కాబట్టి.

రాజారాం : అవసరమైతే నన్ను హెచ్చరిద్దామని వచ్చి ఉంటారు.

పైడిరాజు : అలా అని కాదు కానీ.....

రాజారాం : మొహమాటపడతారెందుకు! నాగయ్యగారూ! మీరు విన్నది నిజమే. నేను పాఠాలు చెప్పే పద్ధతీ, విద్యార్థుల్ని తీర్చిదిద్దే పద్ధతీ కాస్త భిన్నంగానే ఉంటాయి.

నాగయ్య : అంటే ఇంతకు ముందులాకాక స్కూలు మీ స్వంత పద్ధతిలో నడుపుతున్నానంటారు. అంతేనా?

రాజారాం : స్వంత పద్ధతి కాదు. భగవాన్ శ్రీసత్యసాయి బాబావారు బోధించిన పద్ధతి, విద్యార్థుల్ని విజయపథంలో నడిపించగలపద్ధతి, వారిలో దయ, ప్రేమ, కరుణ వంటి సద్గుణాలు వికసింపజేయగల పద్ధతి.

పైడిరాజు : రాజారాం మేష్టారూ! ఇది మీ స్వంత బడి కాదు. ప్రభుత్వానిది. దానికి కొన్ని నియమ నిబంధనలూ, పద్ధతులూ ఉంటాయి. వాటిని తు.చ. తప్పకుండా పాటించడమే. అంతేకాని, మీకు నచ్చలేదని...

**Contd...4**

రాజారాం : మార్చే అధికారం నాకు లేదంటారు అంతేనా? కాని నాగయ్యగారూ! ఒక వ్యక్తి పొరపాటు చేస్తే అతని కుటుంబమే దెబ్బతింటుంది. అదే ఒక ఉపాధ్యాయుడు తప్పుచేస్తే కొన్నితరాల మానవాళి భవిష్యత్తు అంధకార బంధురమవుతుంది. నేనలా జరగనివ్వను.

అవధాని : అంటే మీ చిత్తం వచ్చినట్టు బోధనా పద్ధతుల్ని మార్చేస్తారా?

రాజారాం : మార్చి తీరుతాను. ఒక పద్ధతి సత్ఫలితాల్నివ్వనప్పుడు ఆ మార్గాన్ని మార్చుకోవడంలో తప్పులేదు. ఎన్నో దేశాల్లో స్వాతంత్ర్య సముపార్జనకి రక్తపాతం జరిగింది. కాని ఆ పద్ధతిని మార్చి అహింసా మార్గంలో భారతదేశానికి గాంధీజీ స్వాతంత్ర్యాన్ని సాధించలేదా? విశ్వవ్యాప్తంగా ఆ మార్పును వేనోళ్ళ మెచ్చుకోలేదా? యుద్ధమే శరణ్యమన్న అశోకునిచేత అహింసామార్గాన్ని అనుసరింపజేసి గౌతమబుద్ధుడు ఆ పద్ధతిని చిరస్మరణీయం చేయలేదా?

నాగయ్య : అంటే మీరు గాంధీవో, గౌతమబుద్ధుడో అనా మీ అభిప్రాయం.

రాజారాం : వారు అవతార పురుషులు, వారు చూపిన బాటలో నడవాలనీ, నా విద్యార్థుల్ని ఆ బాటలోనే నడిపించి ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దాలని తపనపడే అతి సామాన్యుణ్ణి. పేరుకోసం ఉద్యోగంచేసి, ధనం సంపాదించుకుని వెళ్ళిపోవాలనన్నది నా అభిమతం కాదు. నా దగ్గర చదువుకున్న ప్రతీ విద్యార్థినీ ఒక వివేకానందుడిగా, ఒక గాంధీగా, మానవత్వం మూర్తీభవించిన శాస్త్రవేత్తగా, అవినీతిపై సమరశంఖారావం పూరించిన అన్నాహజరేగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం.

అవధాని : విద్యార్థుల్ని వివేకానందులుగా తీర్చిదిద్దగల మహనీయులా మీరు?

రాజారాం : మన పిల్లల్ని వివేకానందులుగా తీర్చిదిద్దడానికి మనం మహనీయులం కానక్కరలేదు అవధానిగారూ! మాతృదేశం కోసం మధనపడాలి, లోకోద్ధరణ కోసం తపించాలి, సమాజశ్రేయస్సు కోసం జీవితం అంకితం చెయ్యాలి అంతే.

పైడిరాజు : లోకోద్ధరణ, సమాజశ్రేయస్సు ఇప్పుడున్న పద్ధతిలో సాధ్యం కావా?

రాజారాం : సాధించగలమని మీ గుండెల మీద చెయ్యివేసుకుని చెప్పండి. ఒక్కసారి మీ చుట్టూ ఉన్న సమాజాన్ని చూడండి. విద్యా, విజ్ఞానాలు సంపాదించుకున్న ఎంతోమంది మాతృభూమిని మరచిపోయి ధనం కోసం భిక్షాపాత్ర పట్టుకుని 'దేహీ' అంటూ విదేశాలకు పరుగులు తీస్తున్నారు. గొప్ప గొప్ప డిగ్రీలందుకున్న వారెందరో తల్లిదండ్రుల్ని వృద్ధాశ్రమాల్లో విడిచిపెట్టి వెళ్ళిపోతున్నారు. అత్యున్నత విద్యనభ్యసించిన వారు కూడా అవినీతిపరులై దేశాన్ని దోచుకుంటున్నారు. ప్రేమ, సేవా భావాలతో కొనసాగవలసిన విద్యా, వైద్యరంగాలు వ్యాపారంగా మారిపోయాయి. దానర్థం ఏమిటి? వారు నేర్చుకున్న విద్య వారిలో నీతినిజాయితీల్ని అంకురింప జేయలేదనే కదా!

నాగయ్య : మీరన్నది కొంచెం నిజమేననుకొండి!

రాజారాం : అనుకోవడం కాదు నాగయ్యగారూ! యదార్థం. కంటి కనిపిస్తున్న నిజం. ఎవర్నో ఎందుకు? మిమ్మల్నే తీసుకోండి. ఇక్కడే ఈ స్కూల్లోనే చదువుకున్నారు. లక్షలు సంపాదించుకున్నారు.

Contd...5

| | | |
|---|---|---|
| | | కాని ఈ పాఠశాల కూలిపోతుంటే, గ్రామంలోని రామాలయం శిథిలమవుతుంటే, రోడ్లు ఆధ్వాన్నంగా మారి ప్రమాదాలు జరుగుతుంటే, త్రాగే నీరు లేక ప్రజలు ఇబ్బందులు పాలౌతుంటే, యువకులు జులాయిలుగా తిరిగి సంఘ విద్రోహులుగా మారుతూంటే చూస్తూ ఊరుకున్నారు తప్ప ఈ పరిస్థితిని చక్కదిద్దుదామని ఎప్పుడైనా ప్రయత్నంచేశారా? పిల్లలు పూనుకోబట్టి ఈ గ్రామం నేడు లక్ష్మీగడపలా కళకళలాడుతూ ఉంది. |
| విశ్వనాథ్ | : | మాష్టారూ! మా పెద్దలకి మా గురించి పట్టించుకునే తీరికెక్కడిది. కోట్లు గడించడానికే సమయం సరిపోవడం లేదు. |
| నాగయ్య | : | విశ్వనాథ్! ఏమిటా మాటలు |
| విశ్వనాథ్ | : | కోపం వచ్చిందా నాన్నగారూ! ఏం చదువుతున్నావురా నాన్నా! అని ప్రేమగా నన్నెప్పుడైనా అడిగారా? పాఠాలు అర్థంకాక, మార్కులు సరిగా రాక, ప్రేమతో చెప్పే దిక్కులేక సతమతమౌతుంటే మార్కులెందుకురా నా వెనుకాల తిరుగు లక్షలు సంపాదిస్తావని చెప్పేరు తప్ప ఒక్కసారైనా స్కూలుకొచ్చి మాష్టార్ని నిలదీసి అడిగారా? |
| రాజేష్ | : | సత్యవ్రతుడైన హరిశ్చంద్రుని గూర్చీ, పితృవాక్య పరిపాలకుడయిని రాముని గురించీ, దైవాన్ని నమ్ముకుని విజయం సాధించిన పాండవులుగూర్చీ ఎప్పుడైనా చెప్పారా మాకు! అన్నార్తులకింత అన్నం పెట్టండి, కష్టాల కడలిలో మునిగిపోతున్నవారిని అదుకోండి అని సేవాభావాన్ని అలవాటు చేశారా? |
| రమేష్ | : | మేం ప్రహ్లాదులు కావడం ఇష్టంలేదు మీకు. లక్షలు సంపాదించే యంత్రాల్లా మారాలి. మానవత్వం లేని రాక్షసులం కావాలి. ప్రజల్ని పీడించి సంపాదించాలి. |
| విశ్వనాథ్ | : | చదువూసంధ్యా మాని గోటీబిళ్ళలాడుకుంటూంటే తప్పట్లు కొట్టేరు తప్ప ఇది తప్పురా అని చెప్పలేదు. పాలేర్లతో పరిహాసంగా మాట్లాడుతూ ఉంటే నవ్వుకున్నారు తప్ప సాటివాణ్ణి గౌరవించాలి, తోటివాణ్ణి ప్రేమించాలి అని బుద్ధిచెప్పలేదు. |
| రాజేష్ | : | బాగా చదువుకోండి ఇంజనీర్లో, డాక్టర్లో అయి సమాజానికి సేవ చెయ్యండిరా అని సలహా ఇవ్వలేదు. |
| విశ్వనాథ్ | : | ఏనాడూ ముప్పైమార్కులు చూడని మేము ఈనాడు ఫస్టుక్లాసులు తెచ్చుకుంటున్నాం. అది మాష్టారి చలువ. భారతదేశం ఎంత గొప్పదేశమో. భారతీయులు ఎంత ఆదర్శంగా జీవించారో మన పూర్వీకుల్ని మనం ఎలా అనుసరించారో మాకు తెలిసిందంటే అది మాష్టారి అభిమానం. దీనజనుల్ని ఆదుకోవాలనీ, సాటివారిని ప్రేమించాలనీ అర్థంచేసుకుని ఆచరిస్తున్నామంటే అది మా మాష్టారి ఆశీస్సు. |
| రాజేష్ | : | స్కూలుకు వచ్చే ముందు మాష్టార్ని ప్రశ్నించేముందు మీరివన్నీ తెలుసుకుని రావలసింది. |
| ధర్మారావు | : | నాగయ్యగారూ! ఆ పిల్లల ఆవేదన చూశారా? మాష్టారు చెప్పింది అక్షరాలా నిజం. |
| నాగయ్య | : | ఈ గ్రామంలో చదువుకున్నవాడివి. వాళ్ళకి వత్తాసు పలుకుతావేమిటయ్యా! గ్రామం తరఫున మాట్లాడక. |
| అవధాని | : | మేం చెప్పిందాన్ని సమర్థించాలి కదా |

Contd... 6

ధర్మారావు : ఏం సమర్థించాలి? స్కూలు కూలి పోతుంటే సమర్థించాలా? పిల్లలు పశువుల్లా మారుతుంటే సమర్థించాలా? చదువుకున్న వాణ్ణి కాబట్టి మీ కన్న ముందే ఈ స్కూలు కొచ్చాను. మాస్టారు పాఠాలు చెప్పడం విన్నాను. వారు ఈ గ్రామానికి దేవుడిచ్చిన వరం అని భావించాను. ఇంత ఆదర్శ ఉపాధ్యాయుడిగా ఎలా మారగలిగారని అడిగాను. భగవాన్ శ్రీసత్యసాయిబాబా వారి బోధనలు వినడం వల్ల, వారు గురువుల కిచ్చిన సూచనలు పాటించడం వల్ల, బృహస్పతి లాంటి గురువులూ, ప్రహ్లాదుని వంటి శిష్యులు ఉన్న వారి విద్యాసంస్థల్ని దర్శించడం వల్ల అని వారు చెప్పేరు.

రాజారాం : నేను చెప్పిన వెంటనే ధర్మారావుగారు ప్రశాంతి నిలయం వెళ్ళారు. విదేశాల్లో స్కాలర్‌షిప్పులు కూడా తిరస్కరించి "*We have come to learn not to earn*" అని మన దేశగౌరవాన్ని పెంచినవారినీ, **KINGDOM OF SATHYASAI** అన్న పేరుతో సమాజసేవకి అంకితమ వుతున్నవారినీ, గురువుల్ని గౌరవించనవారినీ, పెద్దల్ని ఆదరించేవారినీ దైవాన్ని విశ్వసించిన వారినీ విద్యార్థుల్ని చూశారు. ముచ్చటపడి మన గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకున్నారు.

నాగయ్య : ప్రశాంతి నిలయం వెళ్ళావా? మరి మాకు చెప్పలేదేం

ధర్మారావు : అప్పటికే టి.వీ.లు చూసీ, పేపర్లు చదివీ ప్రశాంతినిలయంపై దురభిప్రాయం ఏర్పరుచు కున్నారు మీరు.

అవధాని : వాళ్ళు విమర్శిస్తున్నారంటే కొంతైనా నిజం ఉండకపోతుందా అని.

రాజారాం : ఏమిటా నిజం. Come, See, Examine, Experience & Enjoy అంటే రండి, చూడండి, పరిశీలించండి, అనుభవించండి, ఆనందించండి అని భగవాన్ దశాబ్దాలుగా చెబుతూంటే ఒక్కమారైనా మీరు ప్రశాంతినిలయం వెళ్ళారా! కోట్లు ఖర్చు పెట్టి రాయలసీమకు మంచినీళ్ళిచ్చి రతనాలసీమగా మారిస్తే, లక్షలాది మందికి అద్భుతమైన అస్పత్రులు సృష్టించి ఆరోగ్యం ప్రసాదిస్తూంటే, విశ్వవిద్యాలయం స్థాపించి విద్యార్థుల్ని వివేకానందులుగా మారుస్తూంటే ఆ అద్భుతాల్ని చూశారా. వెళ్ళరు, చూడరు, తెలుసుకోరు, అవతారపురుషుడు ఎలా అర్థమవుతాడు మీకు.

అనిరుధ్ : ప్రపంచ ప్రఖ్యాత పాత్రికేయుడు R.K. కరంజియా, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ వినాయక్ కృష్ణ గోకాక్, అణు శాస్త్రవేత్త అబ్దుల్‌కలామ్, ప్రసిద్ధ మనస్తత్వ శాస్త్రవేత్త శామ్యూల్ శాండ్‌విజ్, భౌతికశాస్త్ర శాస్తవేత్తలు డాక్టర్ సూరిభగవంతం, డాక్టర్ వెంకట్రామన్, బ్రహ్మశ్రీ ఘండికోట సుబ్రహ్మణ్యశాస్త్రి, చెరుకుమల్లి కామావధానులు వంటి ఉద్దండ వేదపండితులు ప్రశాంతి నిలయం వెళ్ళారు, బాబాను దర్శించారు. శ్రీసత్యసాయి అవతార వైభవాన్ని సన్నిహితంగా పరిశీలించారు, పరిశోధించారు. భగవాన్‌బాబా అవతార పురుషులని తెలుసుకున్నారు. భక్తి విశ్వాసాలతో వారి పాదాలనాశ్రయించారు. వారిసేవలో జీవితం ధన్యం చేసుకున్నారు. వారికంటె గొప్పవారా ఈ విమర్శకులు? నమస్కారం మాస్టారూ.

Contd... 7

రాజారాం : వీరు అనిరుధ్, సత్యసాయి గ్రామసేవలకు జీవితాన్ని అంకితం జేసిన యువకుడు. సందేహాలుంటే ఈయన్ని అడగండి.

పైడిరాజు : ఏమిటో రకరకాల కథనాలు వెలువడుతూంటే

అనిరుధ్ : రాజుగారు. అఖండ పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న ఎన్నో పత్రికలు భగవాన్ అవతార వైభవం గురించి అద్భుతమైన కథనాలు ప్రచురించాయి. వాటిని చదవలేదా మీరు. రాముడికాలంలోనే రావణుడూ, ధర్మరాజుకాలంలోనే దుర్యోధనుడూ కూడా ఉన్నారు.

నాగయ్య : అంటే ఇవన్నీ నిరాధారమైన అరోపణలంటారా?

అనిరుధ్ : అవును నిరాధారమైనవే. రామరాజ్యం స్థాపించిన రాముడు, అగ్నిపునీత అయిన సీతను స్వీకరిస్తే అపనిందలు వేశారు, గీతను బోధించి, కౌరవుల్ని సంహరింపజేసిన ప్రేమమూర్తి శ్రీకృష్ణపరమాత్మను శిశుపాలుడు దూషించాడు, దుర్యోధనుడు బంధించడానికి ప్రయత్నించాడు. కంసుడు సంహరించడానికి రాక్షసుల్ని పంపాడు, ప్రేమమార్గాన్ని బోధించిన క్రీస్తు ప్రభువుని శిలువచేశారు, షిరిడీ సాయినాధుణ్ణి పిచ్చి ఫకీరన్నారు. అయినా వారి వైభవం తగ్గిందా. వీధివీధినా ఆలయాలు కట్టి ప్రజలు ఆరాధిస్తూనే వున్నారు. అ అవతార పురుషులకి అవతారం చాలించిన తరువాత ఆలయాలేర్పడ్డాయి. కాని సశరీరుడై ఉండగా ఆలయాలు ఏర్పడి కుల, మత, దేశ వర్గ విభేదం విస్మరించి అందరిచేతా దైవంగా కొలువబడుతున్న అవతారమూర్తి సర్వప్రపంచ చరిత్రలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా ఒక్కరే.

అవధాని : అంటే మేవిన్నవన్నీ అసత్యాలా?

అనిరుధ్ : ఇంకా సందేహమా? బాబాను దైవంగా కొలిచిన వారిలో అణు శాస్త్రవేత్తలున్నారు, డాక్టర్లు, ప్రొఫెసర్లు, మేధావులు, కళాకారులు, IAS లు, IPSలు అందరూ ఉన్నారు. వారితోపాటు అతి సామాన్యులూ ఉన్నారు. వీరందరూ విన్న ప్రతివిషయాన్నీ నమ్మేవారూ, కాషాయం కట్టినవారినల్లా అనుసరించేవారూ కాదు కదా!

పైడిరాజు : అనుసరించరనుకోండి. అయినా

అనిరుధ్ : రాజుగారూ! 'సంశయాత్మా వినశ్యతి – నసుఖం సంశయాత్మన:' అని భగవద్గీత చెబుతోంది. ముందా సందేహం లోంచి బయటపడండి. ఫలానా వారు నీ తల్లిదండ్రులని లోకం చెబితే మీరు నమ్మేరు తప్ప, మీ తల్లిదండ్రులెవరో మీకు తెలుసా? అందుచేత నమ్మకం ముఖ్యం

రాజారాం : భగవాన్ బాబా సర్వేశ్వరుడని సర్వజగద్రక్షకుడని ముందు నమ్మండి. అప్పుడు వారు దైవంగా దర్శనమిస్తారు. ***"Faith is to believe what you do not see, The reward of faith is to see what you believe"*** తెలిసిందా?

అనిరుధ్ : సీ॥ కౌస్తుభ శంఖచక్ర సరోజలాంఛిత
మధుర సుందర గాత్ర మాధవుండు
జనపాప పంకిలము పుణ్యచిత్రావతిన్
కడిగిన పరమమాహేశ్వరుండు

Contd... 8

వేదశాస్త్ర పురాణ విద్యలు జిహ్వాపై
నిలుపుకొన్నట్టి పరబ్రహ్మమూర్తి
ఖండఖండాంతరాఖండ ధవళకీర్తి
పండించుకున్న అఖండలుండు
ఆ.వె. ఆ మహాత్ముండు సత్యనారాయణుండు
అఖిల మానవసేవా పరాయణుండు
సత్యశివశక్తియుతుడు జనార్దనుండు
సాయి అవతారమెత్తిన సత్యసాయి

ఇలా వారిని కీర్తించి తరిస్తున్న భక్తుల అనుభవాలు ఎప్పుడైనా విన్నారా? వింటే సర్వజ్ఞత్వమూ, సర్వజగద్రక్షతత్వమూ, కీర్తి, వైభవము, ప్రకృతిపై అధిపత్యం, మానవుడైనా మానవాతీత అద్భుతాలు చేయడం, స్వప్నంలో సాక్షాత్కరించడం, నిర్జీవుణ్ణి సజీవుడిగా చెయ్యడం వంటి దైవ లక్షణాలు కలిగిన పరిపూర్ణవతారమూర్తి భగవాన్ శ్రీసత్యసాయి అని మీకు అర్థమయ్యేది.

రాజారాం : చూడండి నాగయ్యగారూ! ఎనభై అయిదు సంవత్సరాలు అసంఖ్యాకమైన లీలలు ప్రదర్శించి, అరవై అయిదు సంవత్సరాలు మానవ సమాజానికీ, సంఘ శ్రేయస్సుకీ అవసరమైన సేవా పథకాలు చేపట్టీ తన అమృతప్రేమను మానవాళికి పంచి ఇచ్చి తానేమిటో, తన దివ్యత్వమేమిటో, తన అవతార లక్ష్యమేమిటో ఈ ప్రపంచానికి ఋజువు చేసుకున్నారు భగవాన్ శ్రీసత్యసాయి. ఆ సేవలు అవిశ్రాంతంగా, అచంద్రతారార్కం కొనసాగించడానికి విశ్వవ్యాప్తంగా కోట్లాది హృదయాల్లో నిస్వార్థసేవా తత్పరతను పెంచి పోషించారు. ఇక ఎవరికీ తన మహనీయతను ఋజువు చేసుకోవలసిన అవసరం వారికి లేదు. రాముడి గురించి వాల్మీకి ఒక రామాయణం రచించాడు. కాని ఒక్కొక్క భక్తుని హృదయం తెరచి చూస్తే బాబా గురించి కొన్ని వేల రామాయణాలు రచించాలి.

అనిరుధ్ : సీ॥ చిన్నతనముననే చెలువార ఒక పంతు
లయ్యను కుర్చీకి అంటజేసె
సందేహహరణకై 'సాయిబాబా'నని
మల్లెలన్ అక్షరమాలజేసె
కాంక్షించు భక్తుల కామితమ్ములు దీర్ప
చింతచెట్టును వేల్పుచెట్టుజేసె
చిత్రగుప్తుని చిక్కు చిట్టాను సరిదిద్ది
చితికి చేరినవారి బ్రతుకజేసె
అచ్చెరువు తోడ అనిమిషులరయుచుండ
అనుపమానమ్ములైన కార్యములెన్నో
అద్భుతంబుగ సతము సేయంగసాగె
సాయినాధుడు సత్యనారాయణుండు.

Contd... 9

భగవాన్ బాబా విద్యావ్యవస్థకే తలమానికం లాంటి విశ్వవిద్యాలయాన్ని స్థాపించడమే కాదు సమాజహితం కోసం, నీటి పథకాలు, దీనజనసేవా, ఉచిత వైద్యం అందించారు కదా! వాటి గురించి వ్రాయరేమని ఆ విమర్శకులను మీరడగాలి. మాకావసరం లేదు. సమాజంలో ఎంతమంది నాస్తికులున్నా ఆలయాలూ, ఆరాధనలూ దినదినానికీ పెరుగుతున్నట్టే శ్రీసత్యసాయి వైభవం ఇప్పుడూ, ఎప్పుడూ కూడా దివ్యప్రభలతో వెలుగుతూనే వుంటుంది. చూస్తూ ఉండండి.

ధర్మారావు : నాకు తెలిసిన విషయం చెబుతాను నాగయ్యగారూ. బాబా తనను తాను దేవుడిగా ప్రకటించుకోవడం ఏదో తప్పైనట్లు విమర్శిస్తారు కొందరు. కాని బాబా మీరు దైవమా? అని స్వామిని అడిగితే అది సగమే నిజం బంగారూ! నీవు కూడా దైవాంశ సంభూతిడివే ఇది పూర్తి నిజం అని సమాధానమిచ్చారు. అణువణువులోనూ దివ్యత్వాన్ని దర్శించిన అవతార పురుషులు శ్రీసత్యసాయి. అందుకే వారందరినీ "దివ్యాత్మ స్వరూపులారా" అని సంబోధించే వారు. అంటే 'ఈశావాస్య మిదం సర్వం' అన్న ఉపనిషద్వాక్యాన్ని గుర్తించి వర్తించినట్టే కదా? బాబా కర్పూర హారతులు అందుకుంటారని మరో విమర్శ. కోట్లాది భక్తులకు బాబా దేవాదిదేవుడు తమ దైవానికి వారు హారతులిస్తారు, ఊరేగిస్తారు, ఊయ్యాలలూపుతారు. భక్తులుగా అది వారి హక్కు. దాన్ని కాదనే అధికారం కాని, విమర్శించే అర్హత కాని ఎవ్వరికీ లేవు, ఉండవు.

నాగయ్య : మీరు వివరంగా చెబుతూంటే అన్నీ ప్రత్యక్షర సత్యాలనిపిస్తోంది. విషయం తెలియక ఎంత అపార్థం చేసుకున్నాం.

అవధాని : అయితే మాస్టారూ! ఈ గ్రామానికి మేమే మకుటం లేని మహారాజులం కదా. గ్రామం నడిబొడ్డులో నిలబడి మాకే నీతులు బోధించి, తప్పుని చెప్పే ధైర్యం ఎలా వచ్చింది మీకు?

రాజారాం : చెప్పమంటారా?

విశ్వనాథ్ : మీరెందుకు మాస్టారూ! మమ్మల్ని చెప్పనివ్వండి. నాలుక మీద సాయినామం, గుండెల్లో సాయిరూపం నెలకొని వుంటే మీకు చెప్పే ధైర్యమే కాదు, ప్రపంచాన్ని జయించే ధైర్యం కూడా వస్తుంది.

(రామయ్య ఆందోళనపడుతూ ప్రవేశిస్తాడు)

రామయ్య : నాగయ్యబాబూ! నాగయ్యబాబూ! నువ్వేకాపాడాలి

నాగయ్య : ఏమైందిరా! కంగారుపడక జరిగిందేమిటో చెప్పు.

రామయ్య : అబ్బిగాడికి పట్నంలో ప్రమాదం జరిగిందయ్యా. ఆస్పత్రిలో చేర్చాం. రాత్రిలోపల అదేంటో AB పాజిటివ్ అంట ఆ రక్తం, అర్జంటుగా ఎక్కించాలంట. రక్తం నేనెక్కడతేను బాబూ. మీరు తప్ప నాకెవరున్నారయ్యా. అందుకే రక్తం ఏర్పాటు చేసి పుణ్యం కట్టుకోండి బాబూ! ఆడి ప్రాణాలు కాపాడండి బాబూ! మీ కాళ్ళు పట్టుకుంటాను.

అనిరుధ్ : పద రామయ్యా! రక్తం నేనిస్తాను.

Contd... 10

| | | |
|---|---|---|
| రాజారాం | : | నువ్వుండు అనిరుధ్! గ్రామానికి పెద్దలు వారు. గ్రామస్తుల యోగక్షేమాలు చూడవలసినవాళ్ళు. వాళ్ళు తలుచుకుంటే రక్తదానానికి ఒక సైన్యాన్ని పంపగలరు. అదీగాక రామయ్య రక్తం ధారపోసి వాళ్ళ పొలాలు పండించాడు. అందుచేత ఎంతో అభిమానంగా ఆదుకుంటారు. |
| రామయ్య | : | మాస్టారు సరిగ్గా చెప్పారు బాబూ! రక్తం ధారపోసి మీ పొలాలు దున్నేను. బంగారం పండించాను. కరుణించండి నాగయ్య బాబూ! నా బిడ్డకి రక్తం దానం చెయ్యండి. వాడికి ప్రాణం పొయ్యండి బాబూ! ప్రాణం పొయ్యండి. |
| నాగయ్య | : | ఒరే రామయ్యా! నీ అంత తెలివతక్కువవాణ్ణి చూడలేదురా! రక్తం కోసం లక్షలాది ప్రజలున్న పట్నాన్ని వదిలిపెట్టి పదివేలు జనాభాలేని ఈ పల్లెటూరి కొస్తావా? ఇక్కడ రక్తం ఎవరిస్తా ర్రా. ఇదుగో ఈ రెండొందలూ తీసుకొని పట్నానికి పరుగెత్తు. |
| అవధాని | : | సరిగ్గా చెప్పేరు నాగయ్యగారు |
| పైడిరాజు | : | ఆలస్యం చెయ్యక పరుగెత్తరా |
| రామయ్య | : | అయితే రక్తదానం చెయ్యరా బాబూ? |
| అవధాని | : | రక్తదానం అంటే సామాన్యమైన పనా ప్రాణాలు తోడేసి ఇచ్చేడమన్నమాట |
| రామయ్య | : | మాస్టారూ తమరైనా దయతలచండి. నాబిడ్డను బ్రతికించండి బాబూ. నాబిడ్డను బ్రతికించండి. |
| రాజారాం | : | అధైర్యపడకు రామయ్యా! వీరెవ్వరూ నిన్ను అదుకోరని నాకు తెలుసు. వీరు చదువుకున్న చదువులు లక్షలు సంపాదించడానికీ, మేడలు కట్టడానికీ, పదవులలంకరించడానికే పనికి వస్తాయి తప్ప సాటి మనిషిని ఆదుకోడానికీ వాడి ప్రాణాలు కాపాడ్డానికీ కాదు. అనిరుధ్, రామయ్యతో వెళ్ళు వాళ్ళాబ్బాయికి రక్తం దానం చెయ్యి. అతని ప్రాణాలు కాపాడు. మీ వెనుకనే మేమూ వస్తాం. అవసరమైతే మేమూ రక్తదానం చేస్తాం. |
| అనిరుధ్ | : | అలాగే మాస్టారు. పదరామయ్యా! |
| రామయ్య | : | తమర్ని దేవుడు చల్లగా చూడాలిబాబూ! నాగయ్యబాబూ.. తమరి రెండొందలు తమరే వుంచుకోండి. అనవసరంగా మిమ్మల్ని నమ్ముకున్నాను. ఆ బాబాను నమ్ముకోవలసింది. |
| ధర్మారావు | : | చూశారా నాగయ్యగారూ! మన చదువులు నేర్పిన సంస్కారం ఏమిటో? చెమటోడ్చి మనకు సేవ చేసినవాణ్ణి కూడా అదుకోలేక పోయాం. ఇలాంటి ప్రవర్తనని మార్చడానికే స్కూల్లో సత్యసాయి బోధనా విధానాన్ని ప్రవేశపెట్టారు మాస్టారు. ఇప్పటికైనా అర్థమయిందా. |
| రాజారాం | : | సాటివారిని అదుకోలేని సంపదలూ, తోటివారిని ఆదరించలేని చదువులూ నిరర్థకం నాగయ్యగారూ! నిర్మలప్రేమకు, నిస్వార్థసేవకు మించిన ఆధ్యాత్మిక సాధన మరొకటి లేదు. శ్రద్ధతో భక్తితో సమాజానికి సేవచేయండి. సమాజం క్షేమంగా ఉన్నప్పుడే వ్యక్తి క్షేమంగా ఉంటాడు. శ్రద్ధలో భగవంతుని పాదాలూ, భక్తిలో భగవంతుని హృదయమూ ఉంది. |
| నాగయ్య | : | మా ప్రవర్తనకి మాకే సిగ్గు వేస్తోంది. మమ్మల్ని క్షమించండి మాస్టారూ! ఎక్కడినుంచో వచ్చి, ఏ పరిచయం లేకపోయినా మా రామయ్యను ఆదుకున్నారు, మా పిల్లల్ని బుద్ధిమంతుల్లా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నారు, మీకు నమస్కారాలు. |

Contd... 11

ధర్మారావు : నమస్కారాలు మాస్టారికి కాదు. వారిలో సేవాభావం చిగురింపజేసిన భగవాన్ బాబావారికి చెయ్యండి. ప్రేమా, సేవా సమ్మిళితమైన సేవంటే బాబా వారికి ప్రాణం. సేవచేసిన వారిపై వారు ఎంత కరుణ కురిపిస్తారో మీ విశ్వనాధ్ చెప్పేడు నాకు. ఆ కథ మీ నాన్నగారికి చెప్పరా.

విశ్వనాధ్ : ఆ కథ మా నాన్నకెప్పుడో చెబుదామనుకున్నాను కాని ఆయనకు వినే తీరికలేదు. ఒకరోజు భగవాన్ బాబా హైస్కూలు ప్రిన్సిపాల్‌ని పిలిచి మద్రాసులో విష్ణు అనే పిల్లవాడున్నాడనీ అతని తల్లిదండ్రుల వివరాలూ, చిరునామా చెప్పి అతనికి స్కూల్లో సీటిస్తున్నట్లు వర్తమానం పంపించవలసిందనీ, అతన్ని స్కూల్లో చేర్చుకోమనీ చెప్పారు.

అవధాని : ఎంట్రెన్స్ పరీక్ష వ్రాయకుండానే

విశ్వనాధ్ : అంకుల్, ఇదే మాట ప్రిన్సిపాల్ అడిగితే వాడు నా పరీక్షలో ప్యాసయ్యాడు వాడికి సీటివ్వండి అని చెప్పి పంపారు బాబా.

ధర్మారావు : బాబా పరీక్షలో ప్యాసయ్యాడా?

విశ్వనాధ్ : అవును విష్ణు, బాబా పరీక్షలో ప్యాసయ్యాడు. ఒకరోజు అతను క్రిక్కిరిసిన సిటీబస్సులో కూర్చుని ప్రయాణం చేస్తున్నాడు. సీటు లేక, నిలబడలేక అవస్థపడుతున్న ఒక గర్భిణీ స్త్రీని చూశాడు. వెంటనే లేచి పోయి "అక్కా! కూర్చో" అని ఆమెకు సీటిచ్చాడు. ఆమె కూర్చుని "దేవుడు నిన్ను చల్లగా చూడాలి తమ్ముడూ!" అని అతణ్ణి ఆశీర్వదించింది. అ తల్లి ఎంత నిండు మనస్సుతో ఆశీర్వదించిందో, ఈ సంఘటన జరిగిన నాలుగురోజుల్లో సత్యసాయి స్కూలునుండి అతనికి పిలుపొచ్చింది. చిన్న సేవను బాబా ఎలా గుర్తించారో చూశారా! రాజేష్! శివయ్యను తీసుకురా.

నాగయ్య : పనీపాటా చెయ్యలేని వాడెందుకురా

ధర్మారావు : ఇప్పుడు చెయ్యలేడు నాగయ్యగారూ! కాని, ఒకప్పుడు ఆహోరాత్రులు మీకు సేవచేసాడు కదా.

అవధాని : చేసినప్పుడు ఆదరించాంకదయ్యా.

ధర్మారావు : చేసినప్పుడు అందరూ ఆదరిస్తారు. చెయ్యలేనప్పుడు కూడా ఆదరించాలి, అది మానవత్వం అంటే.

శివయ్య : దండాలయ్యగారూ!

రమేష్ : మాస్టారూ! శివయ్య తాత పెద్దవాడయ్యాడు, పిల్లలు లేరు. పాపం ఆకలితో ఆలమటిస్తున్నాడు.

విశ్వనాధ్ : మాకు చాక్లెట్లు కొనుక్కోమని ఇచ్చిన డబ్బు దాచాం. దానితో శ్రీసత్యసాయి అన్నపూర్ణ అమృతకలశం ఇచ్చి శివయ్యకు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తాం.

అవధాని : ఈ పిల్లలు కాని, ఆ ఏర్పాటు చేస్తే అయ్యగారూ! మనమిక గ్రామంలో తలెత్తుకుని తిరగలేం.

నాగయ్య : ఒరేయ్! మమ్మల్ని ఈ గ్రామంలో తలెత్తుకుని తిరగనివ్వండిరా. మాస్టారూ! వీళ్ళకి చెబుతున్న పాఠాలేవో మాకు చెప్పండి. నెలరోజుల్లో గ్రామంలో శివయ్యలాంటి వాళ్ళందరికీ ఉచిత

Contd... 12

వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తాం. వాళ్ళకి అన్నపానాలు అమర్చి వాళ్ళు ఆనందంగా ఉండేలా చేస్తాం.

రాజారాం : మీ పిల్లలకి పాఠాలు చెప్పడం మీకోసమే నాగయ్యగారూ! వారిలో మార్పుతో మీలో కూడా మార్పు రాలేదా. అందుకే బాబా పాదాలాశ్రయించండి. వారి ఆశీస్సులతో ఎన్నో గ్రామాలలో జరుగుతున్న సేవాకార్యక్రమాలను దర్శించండి. అందరం కలిసి ఈ గ్రామాన్ని నందనవనంలా తీర్చిదిద్దుకుందాం. ఈ సేవను ఇతరులకు ఉపకారం చేస్తున్నామన్న భావంతో కాక సేవను ఒక పూజలా, ఒక ఆరాధనలా, ఒక తపస్సులా చేద్దాం. నిండు మనసుతో బాబాను ప్రార్థిద్దాం. వారు మనని సేవామార్గంలో చేయి పట్టుకుని నడిపిస్తారు.

సీ॥ పావనంబులు భక్త జీవనంబులు నీదు
భావనంబులు సాయి! దేవదేవ!
తోషణంబులు కర్ణ భూషణంబులు నీదు
భాషణంబులు సాయి! పరమపురుష!
శిక్షణంబులు సాధు రక్షణంబులు నీదు
వీక్షణంబులు సాయి! విశ్వనాథ!
గోధనంబుల ముక్తి సాధనంబులు నీదు
బోధనంబులు సాయి! పూర్ణతేజ!

తత్త్వసుందర! భక్తమందార! మౌని
మానసానంద చెందిర మందహాస!
వందనంబులు సాయి! ఆనందదాయి!
చందానార్చిత పుష్పాభినందనములు!

విశ్వనాథ్ : మాస్టారూ! నాన్నగారూ! బాబాను పల్లకిలో ఊరేగించి ఉత్సవం చేస్తున్నాం, రండి మాతోపాటు మీరూ పల్లకీ ఉత్సవంలో పాల్గొనండి.

పల్లకి. పర్తిపురీశుని చూడరమ్మో పరమాత్మడొచ్చాడు పాడరమ్మో
పల్లకినెక్కి పరమాత్ముడొచ్చాడు
ప్రేమ పంచి ఇచ్చి పాపాలు తొలగించ ॥పర్తి॥

Contd... 13

చ. 1 బాలప్రహ్లాదుని బ్రోచినవాడు
హాలహాలము మ్రింగి కాచినవాడు
వెంకావధూతకు వరమిచ్చి వచ్చాడు
సత్యసాయిగ తాను అవతారమెత్తాడు
పల్లకినెక్కి పరమాత్ముడొచ్చాడు
అవతారమూర్తిని చూడరమ్మో
ఆనందముప్పొంగ పాడరమ్మో ॥పర్తి॥

చ. 2 పుట్టపర్తిలోన పుట్టినవాడు
మనసుల్లో మలినాలు మాపేటివాడు
దేవధూతగా నిన్ను మార్చేటివాడు
కోరిన వరములు యిచ్చెటి కొండంత దేవుడు
పల్లకినెక్కి పరమాత్ముడొచ్చాడు
సాయిరాముని మీరు చూడరమ్మో
సాయికృష్ణా అని పాడరమ్మో

చ. 3 బ్రహ్మాండమంతాను కదలివచ్చేను
మా ఏసుప్రభువని మురిసిపోయేను
అల్లా ఇతడని నానక్ ఇతడని
విశ్వమంతా సత్యసాయికి మ్రొక్కేను
పల్లకినెక్కి పరమాత్ముడొచ్చాడు
బ్రహ్మాండనాయకుని చూడరమ్మో
భక్తిగ హారతులు పట్టరమ్మో ॥పర్తి॥